క్లుప్తంగా

అధైర్యం వద్దు.. అండగా ఉంటా



మురగారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: అధైర్యం వద్దు.. అండగా ఉంటానని బాధిత కుటుంబానికి మాజీ మంత్రి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. బుధవారం నగరి రూరల్ మండలం ఐనంబాకం గ్రామానికి వెళ్లిన ఆమె గుండె సర్జరీ చేసుకొని విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్ఆర్ సీపీ నాయకుడు, సర్పంచ్ శేఖర్ సోదరుడు మురగారెడ్డి ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ అధైర్యపడాల్సిన అవసరం లేదని తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన త్వరితగతిన సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట ఎంపీపీ భార్గవి భాస్కర్, వైస్ ఎంపీపీ కన్నియప్ప, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, సర్పంచ్ రవికుమార్, కోఆప్షన్ సభ్యులు దస్తగిర్, పార్టీ నాయకులు బుజ్జిరెడ్డి, లీలారామ్, దాము నాయుడు, చంద్రారెడ్డి, రంగనాథం, హరి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్‌కు ఆర్థిక సాయం



గాయపడిన గ్రీన్ అంబాసిడరుకు ఆర్థికసాయం అందిస్తున్న ఎంపీడీఓ సతీష్

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ దళితవాడకు చెందిన ప్రమాదంలో కాళ్లు దెబ్బ తిన్న గ్రీన్ అంబాసిడర్ మునస్వామికి బుధవారం ఎంపీడీఓ సతీష్ ఆర్థిక సహాయం అందించారు. ఎంపీడీఓ సతీష్ మాట్లాడుతూ మునస్వామి గ్రీన్ అంబాసిడర్ చెత్తను సేకరించి వాహనంలో కేంద్రానికి తీసుకెళ్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాళ్లకు తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కలిసి మునస్వామి ఆస్పత్రి ఖర్చుల కోసం రూ.13,700 ఆర్థిక సాయం అందించారు. మండల విస్తరణాధికారి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి శంకర్ ఉన్నారు.

జాతర నిర్వహణ ప్రాంతాల పరిశీలన



జాతర నిర్వహణ ప్రాంతంలో నిర్వాహకులతో చర్చిస్తున్న డీఎస్పీ, సీఐ

నగరి: పట్టణ పరిధిలో జాతర నిర్వహించే ప్రదేశాన్ని డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్, సీఐ విక్రమ్, ట్రైనీ ఎస్ఐ తేజశ్విని పరిశీలించారు. బుధవారం గంగ జాతర కమిటీ సభ్యులతో పాటు గంగమ్మను సిద్ధం చేసే ప్రాంతం అక్కడి నుంచి ఊరేగింపుగా జాతర బండ వద్ద ఏర్పాటుచేసే వేపాకు గుడిసెకు చేరే మార్గాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం గ్రామ దేవతలు ఓరుగుంటాలమ్మ, దేశమ్మలు కొలువుదీరే ప్రాంతాలను, నిమజ్జనానికి గంగమ్మను తీసుకెళ్లే మార్గాలను, నిమజ్జనం చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయా మార్గాల్లో ఉన్న సీసీ కెమెరాలపై ఆరాతీశారు. ఏయే దేవతలు జాతర నిర్వహణ ప్రాంతానికి చేరుకుంటాయో జాతర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. జాతర కమిటీ వారు పోలీసులకు సహకరించాలన్నారు. కమిటీ సభ్యులు జ్యోతి రెడ్డి, దయానిధి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, ఇంద్రయ్య, జనార్దన్, మహేష్ పాల్గొన్నారు.

ఊరంతా జ్వరాలు

వానలు పడుతుండడంతో వేసవి మండుటెండల నుంచి ఉపశమనం కలిగిందనుకుంటే ఇక సీజనల్‌గా వచ్చే జ్వరాల కేసులు మొదలవడంతో ప్రజల్లో భయాందోళనలు రేకెత్తుతున్నాయి. ఇప్పటికే వాతావరణ పరిస్థితుల్లో మార్పులు వచ్చి ఉష్ణోగ్రతలు తగ్గడంతో చిన్న పిల్లల్లో జ్వరం కేసులు మొదలయ్యాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి రోజు 200 పైగా జ్వరం కేసులు నమోదవుతున్నాయి. వీటిలో ప్రభుత్వ ఆస్పత్రులలోనే 80 కేసుల దాకా నమోదవుతోంది. ఇతర వ్యాధులతో వచ్చేవారితో పాటు జ్వరం బాధితులు ఎక్కువగా వస్తుండడంతో ఆస్పత్రిలో మంచాలు సరిపోని పరిస్థితి నెలకొంటోంది. దీంతో ఒక బెడ్‌పై ఇద్దరిని, ముగ్గురిని ఉంచాల్సిన పరిస్థితి వస్తోంది. –నగరి



నగరి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరబాధితులు



పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

- వైరల్ ఫీవర్‌తో బెంబేలెత్తుతున్న ప్రజానీకం
- జ్వరంబారిన పడుతున్న చిన్నారులు
- వారం నుంచి 10 రోజుల వరకు తగ్గని జ్వరం

జ్వరానికి మూలకారణం వర్షాలతో నీరు కలుషితమవడమే. వర్షాలకు ఖాళీ స్థలాల్లో, పల్లపు ప్రాంతాల్లో నిల్వ ఉండే మురుగు నీరు కారణంగా దోమల వ్యాప్తి చెంది జ్వరాలు ఎక్కువవుతోందని వైద్యులు చెబుతున్నారు. కలుషిత నీరు తాగడంతో, సూక్ష్మ క్రిములను చేరవేసే దోమ కాటుతో ఎన్నో రకాల జ్వరాలు వస్తుంటాయి. కలుషిత నీరు తాగడం, దోమలు కుట్టడం తదితర కారణాలతో జలుబు, జ్వరం, టైఫాయిడ్, మలేరియా, డెంగీ, కామెర్లు, చికున్‌గున్యా వ్యాధుల ఉధృతి పెరిగే అవకాశం ఉంది. ఈ వ్యాధులకు సంబంధించిన ఎటువంటి లక్షణాలు కనిపించినా వెంటనే సమీపంలోని వైద్యుడిని ఆశ్రయించాలని వైద్యాధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు ఈ సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం అధికంగా ఉంటుందంటున్నారు. ఇళ్లలో సైతం కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు.

బెంబేలెత్తుతున్న జనం

ప్రస్తుతం వస్తున్న వైరల్ ఫీవర్ జనాన్ని వణికించేస్తుంది. ఒక రోజు వేసే సూది, మందులకు నయం కావడం లేదు. నాలుగైదు రోజులపాటు డ్రిప్స్ ఎక్కించుకోవాల్సిన పరిస్థితి ఉంది. అలా చేసినా జ్వరం తగ్గడానికి వారం నుంచి 10 రోజులు పడుతోంది. జ్వరం తగ్గినా వారం రోజులపాటు నీరసం ఉంటోంది. విడవకుండా జ్వరం రావడం, 103 నుంచి 104 డిగ్రీల వరకు తీవ్రమైన జ్వరం ఉండడం, వాంతులు, విరేచనాలు, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, ఒళ్లు నొప్పులు, నీరసం టైఫాయిడ్ లక్షణాలు. వణుకుతో జ్వరం రావడం, తీవ్రమైన తలనొప్పి, ఒంటి నొప్పులతో పాటు కీళ్లు, కండరాల నొప్పులు, నోరు చేదు, ఆకలి మందగించడం, చాతీపై ఎర్రటి మచ్చలు రావడం, తీవ్ర స్థాయికి చేరినప్పుడు రక్తంలో ఉండే ప్లేట్లెట్ కణాల సంఖ్య తగ్గిపోవడం, రక్తపు వాంతులు, నల్లని విరేచనం డెంగీ లక్షణాలుగా వైద్యారోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. రోజుకు మూడు అంతకన్నా ఎక్కువగా నీళ్ల విరేచనాలు అవ్వడం. శరీరం డీ హైడ్రేషన్‌కు దారితీసి ఒంట్లో ఉండాల్సిన నీటి శాతం తగ్గిపోయి ముఖ్యమైన లవణాలు బయటకు పోతాయి. ఇవి డయేరియా లక్షణాలంటున్నారు. తప్పనిసరిగా పరీక్షలు చేసి వైద్యసేవలు అందుకోవాలని సూచిస్తున్నారు.

నియోజకవర్గంలోని ఆస్పత్రుల వివరాలు		
ఏరియా ఆస్పత్రి	-	1
కమ్యూనిటీ హెల్త్ సెంటర్	-	1
అర్బన్ హెల్త్ సెంటర్లు	-	4
ప్రైమరీ హెల్త్ సెంటర్లు	-	7
వెల్‌నెస్ సెంటర్లు	-	48

పాటించాల్సిన జాగ్రత్తలు

- ఆహారం, నీరు కలుషితం కాకుండా కాచి చల్లార్చిన నీరు వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి.
- మల మూత్ర విసర్జన అనంతరం చేతులు శుభ్రపరచుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలి.
- దోమల వ్యాప్తిని అరికట్టాలి.
- చిన్న పిల్లలకు ఒంటిని పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు వేయాలి.
- ఇళ్లలో దోమతెరలు, కిటికీలకు మెస్లు ఏర్పాటుచేసుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో కొబ్బరి బొండాలు, పాత టైర్లు, డ్రమ్ములు ఉంచకూడదు.
- పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగిన తరువాత తినాలి.



నగరి ఏరియా ఆస్పత్రిలో ఓపీలో బారులు తీరిన రోగులు

వైద్యులను సంప్రదించాలి



జ్వరం వచ్చిన వ్యక్తి సరైన సమయానికి వైద్యులను సంప్రదించకుంటే వ్యాధి తీవ్రతను పెంచుకున్నట్లే. కొన్ని జ్వరాలు ఐదు రోజుల పాటు చికిత్స చేసుకోకుండా వదిలేస్తే ప్రాణాంతకంగా మారే ప్రమాదం కూడా ఉంది. కొందరు స్వయం వైద్యం చేసుకుంటారు. కొన్ని జ్వరాలు వెంటనే తగ్గిపోయేవిగా ఉంటాయి. కొన్ని జ్వరాలు ఆలసత్వం చేసే ప్రాణాంతకం అయ్యేవిగా ఉంటాయి. కనుక జ్వరం వచ్చిన వెంటనే వైద్యుని సంప్రదించి పరీక్షలు చేయించుకొని వైద్యసేవలు పొందడమే ఉత్తమం.

–డాక్టర్ రవిరాజు, వైద్య నిపుణులు

జీడీనెల్లూరు చేతి వృత్తుల విభాగం అధ్యక్షుడిగా కుమార్



కుమార్ ఆచారి

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మేజర్ పంచాయతీ కార్వేటినగరానికి చెందిన కుమార్ ఆచారిని గంగాధర నెల్లూరు నియోజకవర్గం చేతివృత్తుల విభాగం అధ్యక్షుడిగా నియామకం చేసినట్లు కేంద్ర కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కుమార్ ఆచారి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం చేసిన కృషి ఫలితమే ఇది అన్నారు. ఈ పదవి తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌గా నగరి విద్యార్థి



నికాస్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

నగరి: నాగరాజకుప్పం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి నికాస్ జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాడు. ప్రకాశం జిల్లా, చేవూరు గ్రామం, శ్రీరామదూత అనాథ పిల్లల ఆశ్రమ పాఠశాలలో గత నెల 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన అండర్–16 జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొన్న నికాస్ ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాడు. ప్రతిభ చూపిన విద్యార్థిని బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మనాభ రాజు, పీడీ గోపి, ఉపాధ్యాయులు అభినందించారు.

నిజాయితీకి మారుపేరు నారాయణస్వామి

- డిప్యూటీ సీఎంగా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు
- అంత పెద్దాయనపై ఎమ్మెల్యే అర్థరహిత ఆరోపణలు సరికాదు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి



శ్రీరంగరాజపురం: నిజాయితీకి మారుపేరు కళత్తూరు నారాయణస్వామి అనే విషయం రాష్ట్రమంతా తెలుసని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. బుధవారం పుత్తూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం తన తండ్రి రాజకీయాల్లోకి వచ్చారని, సర్పంచ్ స్థాయి నుంచి సమితి అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారన్నారు. ఆయనపై ప్రజలకున్న నమ్మకమే అంతదాకా తీసుకెళ్లిందన్నారు. ఆయన తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ బంధుప్రీతి చూపలేదన్నారు. నిత్యం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేశారని గుర్తు చేశారు. ఇప్పటివరకు ఎలాంటి మచ్చ లేని నాయకుడిగా ఉన్న నారాయణ స్వామిపై గత ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రిగా చేసిన జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఆయన చేసిన అభివృద్ధి పనులు నేటికీ కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయని తెలిపారు. అధికార బలంతో ఎమ్మెల్యే థామస్ ఆయనపై అభాండాలు చేయడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావొస్తున్నా మీరు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చూపాలన్నారు. అసత్యపు ఆరోపణలు మాని.. నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆమె హితవు పలికారు.

మండల అభివృద్ధికి సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దీప

నింద్ర: మండల అభివృద్ధిలో అధికారులు కీలక పాత్ర పోషించాలని ఎంపీపీ దీప అన్నారు. బుధవారం నింద్ర మండల సర్వసభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలపై మండల అధికారులు స్పందించి ప్రజా ప్రతినిధులకు సహకరించాలన్నారు. కొప్పేడు ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రమైన నింద్రలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రి సమయంలో డ్యూటీ వైద్యాధికారి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదే విధంగా మండలంలోని వివిధ గ్రామాల్లో తాగునీరు సమస్య, పారిశుధ్యం సమస్య లేకుండా చూడాలని, రోడ్డు మరమ్మతులు చేయాలని అన్నారు. కో ఆప్షన్ సభ్యుడు అనిల్ మాట్లాడుతూ విజయపురం నుండి తిరుపతికి బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రామాల్లో ఇంటి స్థలాలు 22ఎ జాబితా నుండి తొలగించి అనుభవ పత్రం మంజూరు చేయాలని కోరారు. గ్రామాల్లో ప్రజలు పరిసరాలు పరిశుభ్రతగా ఉంచుకోవడం ద్వారా జ్వరాలు ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి వినీష అన్నారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీరు పూర్తి స్థాయి అమలు చేయాలని, సమస్య లేకుండా చూడాలని సభ్యులు కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యతోపాటు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామని ఎంఈఓ శ్రీధర్‌రాజు అన్నారు. పశువైద్యాధికారి సాయి సౌందర్య మాట్లాడుతూ ఈ నెల 15 నుండి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్నట్లు వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభ, తహశీల్దార్ శేషగిరి రావు, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు, పీఆర్ ఎఈ వీరభద్రం, ఏఓ తులసీరాం, ఏపీఎం పళణి, ఏపీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



గంగమ్మ సేవలో మాజీ మంత్రి ఆర్కే రోజా



మాజీ మంత్రి రోజాను సత్కరిస్తున్న ఆలయ కమిటీ

దీవించమ్మా.. గంగమ్మా..

పుత్తూరు: అందరినీ చల్లగా చూడమ్మా.. గంగమ్మ తల్లీ అంటూ ప్రార్థించినట్లు మాజీ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. బుధవారం పుత్తూరు పట్టణంలోని నాలుగు వీధుల కూడలిలో వెలసిన గంగమ్మకు మాజీ మంత్రి ఆర్కే రోజా దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కర్పూర హారతులందుకొన్నారు. అనంతరం జాతర కమిటీ సభ్యులు ఆమెను ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు ఆమెకు స్థానిక వైఎస్ఆర్ సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఏకాంబరం, పార్టీ నాయకులు దిలీప్‌మొదలి, జయలక్ష్మీ, మనోహర్‌రెడ్డి, లారీమోహన్, ప్రసాద్, వెంకటేశురెడ్డి, సుబ్రమణ్యం, చిరంజీవి, మనోజ్, మీసాలురెడ్డి, శివలింగం, రాంబత్తయ్య, చిన్నా, శంకర్, గంగయ్యనాయుడు, శివ, గుణ, జయబాబు, బొజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

కార్వేటినగరం: మండల సర్వసభ్య సమావేశం గురువారం జరుగుతుందని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మూడు నెలలకు ఒక్కసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి ఎంపీపీ లత ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, అధికారులు గత సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు తీసుకొచ్చి సమస్యలను నివృత్తి చేసిన నివేదికతో రావాలని కోరారు. పరిష్కారం కాని సమస్యల సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు. ప్రతి శాఖ నుంచి సంబంధిత అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

పారిశుధ్య లోపం తలెత్తకుండా చూడండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం: ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా గ్రామాల్లో పారిశుధ్య లోపం తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీఓ ఇంద్రాణి తెలిపారు. బుధవారం ఆమె పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది ప్రజలపై దాడి చేస్తే రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల గ్రీన్ అంబాసిడర్లు, పారిశుధ్య కార్మికులతో కలసి గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని పంచాయతీల్లో చెత్త సేకరణ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని హెచ్చరించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సతీష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న కేబుల్‌వైర్ చోరీ కేటుగాళ్లు



రాగి వైరు దోచుకోని వదిలేసిన ప్లాస్టిక్ కేబుల్

గంగాధర నెల్లూరు: మండలంలోని పాపిరెడ్డిపల్లి పంచాయతీ తిమ్మిరెడ్డిపల్లి గ్రామ పరిసరాలలో బోరు మోటార్ల వైర్ల చోరీ కలకలం రేపింది. గత నాలుగు రోజులుగా గ్రామంలో రైతుల పొలాల్లోని బోరు మోటార్లకు బిగించుకున్న వైరును దొంగలు కత్తిరించి ఎత్తుకెళ్లారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇంతటితో ఆగని దొంగలు.. కొత్త వైరు బిగించుకున్న రెండో రోజే దాన్ని కూడా ఎత్తుకెళ్లడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. అదేవిధంగా పెడకంటపల్లిలో మినరల్ వాటర్ ప్లాంట్ వైరును కూడా దొంగలు చోరీ చేశారు. తిమ్మిరెడ్డిపల్లి గ్రామస్తులు విటల్ రెడ్డి, లక్ష్మీకరరెడ్డి, పాపిరెడ్డిపల్లి వెంకటేష్ రెడ్డి, గిరి, శ్రీకాంత్ రెడ్డి, మార్కొండ, మురళి, రాజారెడ్డి, సురేష్, హరితో పాటు మరికొందరికి చెందిన బోరు మోటార్ల వైర్లను దొంగలు దోచుకెళ్లినట్టు చెబుతున్నారు. ఒక్కో కేబుల్ వైరు ధర రూ.10 వేల వరకు ఉందని వాపోతున్నారు. కేబుల్ వైరు ఉన్న కట్ చేసి.. అందులోని రాగిని మాత్రం తీసుకుని, పైన ఉండే ప్లాస్టిక్ వైరును అక్కడే వదిలి వెళ్లారని తెలిపారు. కేబుల్ వైర్ల చోరీ ఘటనపై జీడీ నెల్లూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని రైతులు తెలిపారు.

అట్టహాసంగా నిమజ్జనం



గంగమ్మ ప్రతిమను నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురంలో గంగ జాతరలో భాగంగా బుధవారం అమ్మవారికి అంబలి, కుంభం వేసి నిమజ్జనం చేపట్టారు. ఉదయం మహిళలు అంబలి, కుంభాన్ని పంబవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తెచ్చి అమ్మవారి ఎదుట పోశారు. ఉదయం 9 గంటలకు తోటివారు బలి చుట్టి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. 11 గంటలకు గంగమ్మతల్లిని బాణసంచాలు పేల్చుతూ యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు వేస్తూ అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు అమ్మవారి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం శ్రీకావేరిరాజుపురం కొత్త చెరువులో అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేశారు.

అంబరాన్నంటిన గంగమ్మ సంబరం



పుత్తూరులో కొలువైన గంగమ్మ

పుత్తూరు: గ్రామ దేవత పిడికిలి గంగమ్మ జాతర సంబరాలు అంబరాన్నంటాయి. బుధవారం ఉదయం 4 గంటలకు అమ్మవారి ప్రతిష్ట అనంతరం ఆనవాయితీగా కోడి, మేకపోతు, దున్నపోతులను బలిదానం చేయడంతో అమ్మవారు కన్నులు తెరిచి భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారి తొలి హారతిని బెస్త సంఘ పినపెద్దకు ఇచ్చి సర్వదర్శన భాగ్యం కల్పించారు. దీంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. జాతర సందర్భంగా మహిళలు చేసిన కోలాట నృత్యాలు అందరినీ అలరించాయి. మధ్యాహ్నం 1 గంటలకు సాళ్వాకం వంశస్తులతో నగరి కుంభం కార్యక్రమం వైభవంగా జరిగింది. రాత్రి 8 గంటలకు జాతర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాటకచేరీ అలరించింది. ఉదయం నుంచి రాత్రి వరకు అంబలి, ఇతర ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం రాత్రి 11 గంటలకు అమ్మవారికి బెస్త సంఘం వారు ఇచ్చిన ముత్యాల హారతితో జాతర పరిసమాప్తి అయ్యింది. ముత్యాల హారతితోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మోరు గుంటలో నిమజ్జనం చేశారు. అమ్మవారి దర్శనార్థం చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పుత్తూరు జనసంద్రమైంది.



కోలాట నృత్యం చేసిన మహిళలకు సన్మానం



ఊరేగింపుగా వస్తున్న నగరి కుంభం